


# వింత చీకట్లు

పాలకోడేటి సత్యనారాయణరావు

## చీకటి

కాటుకలాంటి చీకటి

అందమైన ఆడపిల్ల కంటి కొసలనున్న కాటుకలాంటి చీకటి.

ఆ చీకట్లో - ఆ కాటుకలాంటి చీకట్లో - అందమైన ఆడపిల్ల,

చీకటి నిజం. ఆడపిల్ల అబద్ధం. ఆ క్షణంలో ఆడపిల్ల అక్కడలేదు అయినా అందంగా తెరమీద ఆడపిల్ల కనబడుతోంది. ఆ తెరమీద ఆడపిల్ల అందంగా వుంది. అంతటి అందం ఎవరిదైనా అయితే - వారు అదృష్టవంతులే!

ఆ అందాలకన్య ,ఆ క్షణంలో తెరమీద అందంగా ఏదో ఎవరివోమాటలు తన స్వంతం లాగే అనేస్తోంది! ఆ అనే మాటలు ఎవరితోనైనా అంటే వారూ అదృష్టవంతులే!!

—సినిమాచూస్తున్న శివరావు ఆలోచనలు రకరకాలుగా వున్నాయి.

రోజూ ఉండే రొటీన్‌కు కొంచెం దూరంగా ఉండాలనే కోరికతో ఈ రోజున సినిమా కొచ్చాడు శివరావు.

వస్తే...

సినిమా...తెలుగు సినిమా

తెలుగు సినిమాలో తెలుగు పడుచు!—

తెలుగు పడుచు పలుకుల్లో పతివ్రతా లక్షణాలు!—

సినిమాలాటి జీవితాలు—

తెలుగుదనం లేని జీవితాలు...

—శివరావు ఇబ్బందిగా కదిలాడు.

కొంచెం రిలీఫ్‌గా ఉంటుందని ఈ సినిమా కొస్తే—ఇదేమో—గతం తిరగతోడుతూ...మనసంతా కెలుకుతూ...

—శివరావు కుర్చీలోంచి లేచాడు. అడుగులో అడుగు వేసుకొంటూ బయటకు నడిచాడు. బాల్కనీలోకి వచ్చి నిలబడ్డాడు. బాల్కనీలోంచి బయటకు చూశాడు.

బయట వర్షం కురుస్తోంది.

ఆకాశంనుంచి నేలకు నీటిదారలు వంతెనలా వాన!

మనసులో మెదిలే గతం మీదనుంచి వర్తమానంలోకి జారుతున్న వాన!!

అందమైనభవిష్యత్తును తుడిచివేస్తూవాన!!

○ ○ ○

చీకటి

గతంలాటి చీకటి

క్షణ క్షణం గుర్తుకొచ్చి బాధపెట్టే గతంలాటి చీకటి,

ఆ చీకట్లో!...ఆ గతంలో ... అందమైన ఆడపిల్ల.

చీకటి నిజం. గతం నిజం

ఆడపిల్ల అబద్ధం ఆమె పలుకులు మరీ అబద్ధం.

—పరిమళ మనసంతా బాధగా ఉంది.

ఈ సినిమా...తన గతంలో ... తెరమీద కనబడుతోంది,

తెరమీద కనబడే దానికన్నా తన మనసు మీద పడుతున్న దృశ్యం మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

—అదుగో—

ఆ చెట్టుకింద కుర్చీలో తన భర్త ... ఇటు పక్కగా తను—తను, తనతో బాటుగా మనోహర్...

వెచ్చగా కౌగిలింతలో తను...

కొత్తగా కొత్త చేతులలో తను...

— ఇవన్నీ చూపిస్తూ ఆ వెనుక కెమెరా, కెమెరా దగ్గర రావుగారు...

ఔను—

ఈ సినిమా — ఈ తెలుగు సినిమా తన జీవితంలో ఒక భాగం.

ఎవరి జీవితంలోనూ సినిమాకు ఇంతటి ప్రభావం ఉండకపోవచ్చు . ఎందుకో తన జీవితంలో ఎన్నో ప్రత్యేకతలు...

తను ఎదుగుతున్న రోజుల్లో, తనతోబాటుగా తనలో ఇన్నాళ్లుగా దాక్కున్న అంద చందాలన్నీ ఒకదానితర్వాత ఒకటిగా విచ్చుకొంటూ పదిమందిలో తనకో ప్రత్యేకత -

తను కట్టిన చీర చెరగుల్లోంచి,తనుదాచినా దాగని వంపుసొంపులన్నీ పదిమందినీ పలుకరించటం తనకిష్టంలేకపోయినా, తనకు ప్రత్యేకత -

తన్ను తాళికట్టి దగ్గర జేర్చుకొన్న భర్త క్షణ క్షణం తనలోని అంద చందాలన్నీ కొలిచి, సుఖాల శిఖరాల మీదకు చేర్చుకొన్నా గానీ, తనలోని ఆ సొగసు శిఖరాలు రవంత జారక పోవటం తన ప్రత్యేకత -

అందుకే—

ఆనాడు డాన్స్ ప్రోగ్రాంచూసి బయట కొస్తోంటే - ఆ వ్యక్తి తన్ను అంతటా పట్టి పట్టి చూడటం...ఆ తర్వాత తనకు సినిమా ఛాన్సు కలుగజేస్తానంటూ రావటం ...ఔను, ఆ వ్యక్తి రావుగారు– తనభర్త మేఘమాలలో తేలిపోవటం తను వద్దంటున్నా– మనసు తారాపథం కోరినా, కొత్త వెనక్కు తీయటంవల్ల– వినక తను సినీరంగంలోకి రావటం -

ఈ రోజున అదంతా గతం.

అదంతా అందమైన గతం కావాల్సింది పోయి - ఈ క్షణంలో తన్ను భయపెట్టగలిగే గతం కావటం......ఇదీ తనలో ప్రత్యేకతే ఏమో!

–తెరమీద అఅందమైనఆడపిల్ల హీరోతో ఊటీలో మేఘాల మధ్యకు కారులో షికారు కొచ్చింది. 'నీతోటిదే నాకు లోకం. ఇదే నాకు నా లోకం' అంటూ పాడుతూ అతన్ని రకరకాలుగా కవ్విస్తూ, అతన్ని రకరకాలుగా హత్తుకొంటూ...

– పరిమళ ఉలికి పడింది.

—ఔను, ఇక్కడే - ఇక్కడే మనోహర్ నటించటం మానేశాడు. అంతసేపు అతను నటించినా, ఆ క్షణంనుంచి అతనిలో నటుడు మరగుకు పోయాడు! పరిమళకు తెలుస్తూనే వుంది - మనోహర్ చేతుల్లోని వేడి ... తన వంటిని కాలుస్తూ ... తనలో ఏదో భావాల్ని రేపుతూ...

తనకు కౌగిలింత కొత్తదికాదు.

కానీ, ఈ అనుభూతి వింతగా వుంది — ఎదురుగా భర్త కుర్చీలో - తన్ను పరిశీలిస్తూ పదిమంది. అయినా తను పరాయి మగాడి కౌగిలిలో... ఈ అనుభూతి, ఇది అనుభూతి అనాలా, అనుభవం అనుకోవాలా—ఇది తన జీవితంలో కొత్త మలువు... కోరుకోని, ఊహించుకోని మలుపు.

కానీ—

ఆ తర్వాత. మనోహర్‌తో మరోసినిమా–

ఈ సారి మనోహర్ కిందటిసారిలా కొత్తగా కనిపించలేదు. మనోహర్‌లో ఉన్న ఆకర్షణ ఏదోగానీ. తను దానికి లొంగిపోవటం తెలుస్తూనే ఉంది. మనోహర్ తన్ను తాకినపుడు తనలోరక్తం పొంగడం—పరిమళకు అందంగా ఉంది, ఆనందంగా ఉంది, భయంగానూ వుంది.

భర్త కౌగిలిలో దొరకని ఆనందం, మనోహర్ చేతులలో ఉందా?

—ఇది నిజమా?

కాకపోతే –

తన ఊహేనా?

అయితేనేం -

ఊహ ఇంత మధురంగా ఉంటే నిజం?

– పరిమళకు అంతా అదోవిధంగా ఉంది–

- ఆ తర్వాత... తను కోరుకున్న కొత్త రుచులు, తనకు కొన్ని దూరంచేసి, మరి కొన్నిటిని దగ్గరకు చేర్చాయి.

ప్రేమ, మమత, కడుపుతీపి - ఇవన్నీ దూరం అయ్యాయి.

కాంట్రాక్ట్, కాల్‌షీట్, 'రష్. ప్రింట్ ప్రివ్యూ...ఇవీ, వీటన్నిటితోబాటుగా డబ్బు, పలుకుబడీ, ఇంకాతొరగా తనకో స్థిరస్థానం– ఈనాడు ఎవరైనా తెలుగు చిత్రరంగం చరిత్ర రాస్తే, దాంట్లో తను లేకపోతే, అది అసంపూర్ణం.

కానీ...

తనకెక్కడో వెల్తి.


Phone: 76282

POTLURI
SURYAPRAKASA RAO & Co.,

*Contractots :* SRI RAMAKRISHNA RICE MILL
*Managers:* POTLURI SURYAPRAKASA RAO

Kandulavari Street
VIJAYAWADA-1.

తను కోల్పోయిందేమిటో తనకే తెలీని స్థితి.

ఏం జరిగింది తనకు ఆ క్షణాలలో?

ఏం కోల్పోయింది తను?

- పరిమళలో అసహనం అధికమయి పోయింది.

కుర్చీలోంచి లేచి.చీకట్లో తడుముకొంటూ, తెరలు తొలగించుకొని వెలుగులోకి వచ్చింది పరిమళ.

బాల్కనీ వెలుగులలో- ఎదురుగా శివరావు!

అవును, శివరావే!

శివరావు వెనుకగా ధారగా వాన.

ఆకాశంనుంచి నేలకు నీటి దారాల వంతెనలా వాన-

మనసులో మెదిలే గతంనుంచి వర్తమానంలోకి జారుతున్న వాన!

మనసులో ఎగిసిపడే సంతోషంలా వాన!

- మెరుపులా ఆనందం.

గతంలాటి ఉరుము!

నటిగా ఉన్న అనుభవాన్ని ఆ క్షణంలో దగ్గరకు చేర్చుకొంటూ,సుతిమెత్తగా అడుగులో అడుగువేసుకొంటూ ముందుకొచ్చిందిపరిమళ.

గొంతు పెకల్చుకొంటూ అంది: "ఏమండీ!"

శివరావు ఒకసారి వెనక్కు తిరిగాడు. ఎదురుగా - ఎదురుగా తన పరిమళ, కాదు, నటి శోభిత!

"మీరా, శోభిత..."

"కానండీ, పరిమళను" అంది పరిమళ.

-పరిమళ అన్న పేరు బాగుండలేదని రావుగారే తనపేరు శోభితగా మార్చి, ఆ తర్వాత అదేపేరు తన పేరు చేసేసాడు -

శివరావు పేలవంగా నవ్వాడు. అయినా ఆ నవ్వులోనే, ఆతని మనసులో ఉన్న ఆనందం ఒకసారి తొంగిచూసే వెళ్ళింది.

"బాగున్నారా?"

పరిమళకేం చెప్పాలో తెలీటంలేదు - ఓ అందమైన ఇల్లు, ఇంటిముందు గూర్ఖా, ఓ పెద్ద కారు, బాంక్ బాలన్సు, బోలెడంత కీర్తి - ఇవన్నీ ఉంటే బాగున్నట్లే అయితే తను బాగున్నట్లే! - మనసుకు కొరతలేని తృప్తి కలిగి ఉండటమే బాగుండటం అయితే - 'ఉహూ!' - ఇదీ తన జవాబు.

అయినా ఈ క్షణంలో ఈ ప్రశ్నకు జవాబు అనవసరం.

"ఈ రోజున ఔట్‌డోర్ షూటింగ్ ఉంది. సూర్యారావుగారు రాకపోవటంవల్ల...అంటే, అదే వర్షంవల్ల... షూటింగ్ కాన్సిల్ అయిపోయింది. పేపరు తిరగేస్తోంటే, ఈ సినిమా ఇక్కడ మార్నింగ్ షో అని తెలిసింది,

# వేకువ!

వేకువ చల్లగాలి
కన్నీటి మీంచి వచ్చినట్లు
ఆరుబయట నిరాశ్రయుల
ఆర్తజీవనం మీంచి వచ్చినట్లు
ఎంతబరువుగా వీస్తోంది
ఎంత భారంగా వస్తోంది
శరీరాన్ని స్పృశించి నంత మాత్రానే
చైతన్య స్పృహ నిదర లేస్తుంది
నీటిగాలి వేకువ
యుగయుగాల నుంచి బరువు గుండెల్తో
నిలబడ్డ చెట్లతోనూ
మనిషి మనిషికి చేసిన హానికి
నిస్సహాయంగా ఎరుపెక్కిన వీధి దీపాల్తోనూ
నీటిగాలి వేకువ
పోటెక్కిన ఏరు
పాలసీసాల మెళ్లో మువ్వల సవ్వడి
పసిపిల్లల గుక్కపట్టిన ఏడ్పులరొద
ఎక్కడో శూన్యం మీద
పడి పగిలి పోతున్న
కుక్క అరుపుల్తోనూ—
రాత్రంతా సాగిన మానం బేరాల్తో
అపుడే నిదరలోకి ఒరిగిన
ఆ నిర్భాగ్యురాండ్ర గుండెమంటల్తోనూ -
ఆకలితో కడుపులో కాళ్ళు పెట్టి
పడుకున్న మాలపల్లెల్తోనూ —
కామందు కొలువులో గొడ్డుచాకిరితో
కొండెక్కుతున్న దీపాల పాలేర్లతోనూ
ఈ వేకువ నీరై
సముద్రంలా పరచుకున్న
నాలోకి కరిగి కరిగి పోయింది.

—కె. శివారెడ్డి

ఎంతైనా ఇదే కదా మొదటి సినిమా. ఒక్కసారి చూసి పోదామని వచ్చాను!—" పేక బిగిన పోర్షన్ అప్ప చెప్పినట్లుగా పరిమళ.

"గతంలోకి తొంగి చూడటం?—"

శివరావు అన్నదానికి పరిమళ ఏమీ అనలేదు.

"నేనొక్కసారి గతాన్ని చూసిపోదామనే వచ్చాను!" అన్నాడు శివరావు.

క్షణం ఆగి పరిమళ —"రండి. అలా వెళ్ళి కాఫీతాగివద్దాం!"

మౌనంగా తలఊపాడు శివరావు.

—ఇద్దరూ నెమ్మదిగా మెట్లు దిగుతోంటె, టాకీసులో పనిచేసే ఎవరో వెళ్లి గొడుగు తెచ్చాడు.

వాన—గతానికి. వర్తమానానికి వారధి కడుతూ వాన.

వానలో...గొడుగులో...తాము ఇద్దరమూ ఒకరినొకరు తాకకుండా ... దగ్గర ఉండినా ఎంతదూరమో!...

—ఈ రోజు కలయిక ఇలా ఇలా ఉండిపోతే...గతానికి ఈ క్షణాలలో సమాధి కట్టుకొని, అందాల భవిష్యత్తుకు వర్తమానం నుంచి వంతెన కట్టుకొంటే... కట్టుకొంటే బాగుండును. కానీ...శోభితకు, అదే పరిమళకు...ఈ రోజులో అన్ని అందాలు కనిపిస్తున్నాయోలేదో...

పరిమళ బురదగా మారిన ఆ ప్రదేశంలో నెమ్మదిగా ఒక్కో అడుగు చూసివేస్తోంది. ఈ జాగ్రత్తలో వందోవంతు జీవితంలో ఉండి ఉంటే ... ఇన్ని తప్పటడుగులు పడకనే పోవును!—

అవును, తప్పటడుగు వేసింది తనే!

—రావుగారు అడగటం తనకెందుకో అపూర్వమనిపించింది. అందుకే పరిమళ వద్దంటున్నాగానీ తను బలవంతపెట్టి...

పరిమళ కారుతాళం తీసింది. డోరుతెరచి లోపలకూర్చుంది. అందంగా వంగి అటుపక్క డోరుతెరచింది.

—ఔను. ఆ రోజుతను చేసినఆతప్పుకు ఫలితం ఇది—కారులో పరిమళ. తనుఇక్కడ.

"రండి!"—ఆహ్వానించింది పరిమళ.

పరిమళ పిలవాల్సింది తన్ను కారులోకి కాదు. జీవితంలోకి!

కానీ...

ముందుకు నడిచాడు శివరావు.

పరిమళ కారుస్టార్ట్ చేసింది. అందంగా కారు మలుపు తిరిగింది.

—సినిమాలో చేరిన పరిమళలో ఏదో కొత్తదనం ఆ కొత్తకు ఫలితం ఏదో తను తెలుసుకొనే సరికే ఆలస్యం అయిపోయింది—మనోహర్‌తో వెళ్ళిపోదలుచుకున్నట్లుపరిమళకి చెప్పిన రోజున—ఔను, ఆరోజు—భూకంపం రాలేదు. అగ్ని పర్వతాలుబ్రద్దలవలేదు. కానీ తన జీవితంలో అంతకన్నా ప్రమాదం జరిగిపోయింది.

—జీవితాన్నే కోల్పోయిన రోజు అది!

పరిమళ జీవితం కొత్త మలుపులతో

తను మాత్రం అక్కడే...

కారు ఆగింది. కార్లోంచి పరిమళ దిగింది. పరిమళ దిగటంలోనూ ఏదో హుందాతనం. ఎక్కడెక్కడి నుంచో కొత్త అందాలన్నీ ఆమెలో చోటుకోసం వెతుక్కుంటున్నాయిలా ఉంది!


నూతన సంవత్సర శుభాకాంక్షలతో

పో. బా. నెం. 333



విజయ సైంటిఫిక్

ఎక్విప్మెంట్సు

5-9-285 అబిద్‌రోడ్

హైదరాబాద్-1

టెలిఫోన్: 22829

టెలిగ్రాంలు: Microscope

కాంగ్రెసు ఆఫీస్ రోడ్

విజయవాడ-2

టెలిఫోన్: 73665

టెలిగ్రాంలు: EQUIPMENTS

శివరావు దిగాక, తాళం వేసి, హాండ్ బాగ్ ఊపుకొంటూ విలాసంగా లోపలికి కదిలింది పరిమళ.

—అనుసరిస్తూ శివరావు.

బేరర్ వచ్చాడు, బేరర్ చూపుల్లో అభిమానం, గౌరవం, ఆసక్తి ఇంకా కొంచెం సంతోషం. శివరావుకు ఆశ్చర్యంగా ఉంది-

బేరర్ వచ్చేవరకు నిశ్శబ్దం. ఆ తర్వాత బేరర్ తెచ్చిన చాక్లెట్ తాగుతూ...శివరావు మనసంతా అదోలా ఉంది.

—పరిమళను అడిగితే...ఎంతైనా పరిమళ తన సొంతం. చేసిన ఒక్క తప్పటడుగు వల్ల తను ఆమెను కోల్పోవలసిరావటం దురదృష్టం. ఈ రోజున...ఇలాగే... తను ఆ సంగతి మర్చిపోయి పరిమళతో తిరిగి...,కానీ అవి అడిగితే పరిమళ ఏమ ఉందో?

—పరిమళకేసి చూస్తే, ఆమె చిన్నగా నవ్వుతోంది.

ఇద్దరి మధ్యా ఇంతటి మౌనం ఎక్కడిది?

కలబోసుకోవాల్సిన ఊసులు,తెలియజెప్పాల్సిన కోరికలు ఎక్కడికి పోయాయి?

—శివరావు చాలాసేపు ఆలోచించి, అడగటానికే నిర్ణయించుకొన్నాడు.

"పరిమళా..."

లోపలికి బేరర్ వచ్చాడు బిల్‌తో-

నవ్వింది పరిమళ- శివరావు జేబులోంచి పర్సుతీశాడు; కళ్ళతోనే వారించింది పరిమళ. హేండ్‌బ్యాగ్ లోంచి ఓ వందరూపాయల కాగితం ఆ బేరర్‌కు అందించింది- భక్తితో బేరర్ బయటికి నడిచాడు—

పర్సుమూస్తూ ఒక్కసారి చూశాడుశివరావు పదిరూపాయల నోట్లు కనబడ్డాయి-పర్సుమూసేసాడు-


"పరిమళా!"

పరిమళ ఆ క్షణంలో సుతారంగాముఖాన్ని పఫ్‌తో అద్దుకొంటోంది- శివరావు క్షణం ఆగాడు—

—ఈసారి ఎవరో లాల్చీ వ్యక్తి లోపలికి వచ్చాడు— రావటం రావటం తిన్నగా పరిమళ దగ్గరగా చేరాడు- భక్తినటిస్తూ నమస్కారం చేశాడు-

"క్షమించండి- బేరర్‌కు తెలీదు- మీరీ హోటల్‌కు ప్రివిలేజెడ్ గెస్టు అని! మీరు ప్రారంభించిన ఈ హోటల్లో మీరు బిల్లు చెల్లించటం...క్షమించండి..."

—శివరావు ఆశ్చర్యంగా పరిమళకేసి చూశాడు- పరిమళ వందరూపాయల నోటును




నిర్లక్ష్యంగా బాగ్‌లోకి తోస్తోంది- ఎదురుగా ఆ హోటల్ ప్రొప్రయిటర్...

"మీరు క్షమించానంటే కానీ కుదరదు- మీరేకదా ఈహోటల్‌కు ఇనాగరేషన్ చేసింది- ఇదేదీ జరగలేదనే అనుకోండి"...

శివరావు వింతగా అతని కేసి చూశాడు.

—ఈసారి అతనూ శివరావుకేసి చూసి, పరిమళను నెమ్మదిగా అడిగాడు, "మీరుసెక్రటరీని మార్చినట్లున్నారే! ఇతను బాగానే ఉన్నాడులెండి!

ఉలికిపడింది పరిమళ—శివరావు ముఖం జేవురించి పోయింది—

పరిమళ కుర్చీలోంచి లేచింది. శివరావు లేవటం చూసి-

శివరావు ముందునడుస్తొంటే వెనుకగా పరిమళ-

కారుకదిలాక నెమ్మదిగాఅంది"క్షమించండి"

శివరావు ఏమీఅనలేదు- ఆవిమానంలాంటి కారులో అతను ఓ పురుగులా ముడుచుకొని కూర్చున్నాడు— ఇంతవరకూ అతనిలో ఉన్న ఆలోచనలేవీ అతనిలో ఈ క్షణములోలేవు- తను కోరుకున్న పరిమళకూ, ఈ రోజున తన ముందునిలబడ్డ శోభితకు ఎక్కడా పొంతనలేదు- ఉండదు-

సమాజంలో పరిమళ ఎదుగుతుంది—

తను కుదించుకుని పోతున్నట్లుగా అనిపించింది శివరావుకు-

శివరావుకు ఎదురుగా కారు అద్దంలోంచి వాన కనిపిస్తోంది-

వాన!

—ఆకాశంనుండి నేలకు నీటిదారాల వంతెన—

మదిలో మెదిలే గతాన్ని తుడుస్తూవాన!
కోరుకున్న భవిష్యత్తును తుడిచివేస్తూ వాన!!

—ఆవాన వరదలై, తననూ, తన భవిష్యత్తునూ ముంచివేస్తున్నట్లుగా శివరావుకు అనిపించింది- మనసులో మెదిలిన కోరికలు నీరు కారిపోతోంటే, దానికి సానుభూతిగా ప్రకృతి అంతా రోదిస్తున్నట్లుగా వానకురుస్తోంది-

శివరావుకు తన జీవితం చుట్టూ చీకటి జిల్లేళ్ళు మొలచినట్లుగా కనిపించసాగింది-

శోభితకారు ముందుకుపోతూనే ఉంది-

...—...